# మినీ కథ

## నేస్తం.... నన్ను ....

రాయచూరు
**30-12-85**

నా అభిమాన రచయిత మురళీకృష్ణగార్కి వ్రాయునది. "వెన్నెల" వార పత్రికలో మీకథ చదివాక మీతో కలం స్నేహం చేయాలనిపించింది. "స్నేహానికి నిర్వచనం" కథ చాలా బాగుంది.

నేను ఓ బడిపంతులి భార్యామణిని ఇద్దరు పిల్లలు. మామూలు గృహిణిని. వంటా, వార్పూ. తీరిక సమయం పోచుకోలు కబుర్లతో కాకుండా పుస్తకాలతో వెళ్ళబుచ్చుతాను. నా చిన్న రాజ్యంలో మా వారు రారాజు. నాకు స్నేహానికి ప్రాణమిచ్చే నేస్తాలు కరువు. అందుకే నేస్తం... చేస్తావా నాతో స్నేహం! మీ జవాబుకోసం ఎదుకు చూస్తుంటాను.

మీ అభిమాని,
శాకుంతలి

•

-యచూరు.
**26-2-86**

డియర్ మురళీగారూ!

మీ ఉత్తరం ఇప్పుడే అందింది. మీకు నాతో కలంస్నేహం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా వారితో చెబితే ఏమన్నారో తెలుసా? "శాకుంతలీ! నీవు సంతోషంగా ఉండటమే నాకుకావలసింది." అని.

అవును, మీరు ఇంకా వివాహమెందుకు చేసుకోలేదు? త్వరగా చేసుకోండి. మీ వివాహానికి వచ్చి మిమ్మల్ని చూసేభాగ్యం కలుగుతుంది మాకు. ఏమంటారు?!

రాయచూరుకు 18న వస్తానని రాశారు. రాలేదేం? ఎంత ఎదురుచూశానో తెలుసా? ఈ వారం మంత్రాలయం వెళ్తున్నాను.

మీ కథ "ఆడవాళ్ళూ! జాగ్రత్త" 'నెలవంక' మాస పత్రికలో చదివాను. సింప్లీ సూపెర్బ్! కానీ ఎండింగులో హీరోయిన్‌ను బ్రతికించి ఉంటే ఇంకా బాగుండేది. త్వరగా రిప్లై ఇవ్వండి. ఇస్తారుగా!? ఉంటాను.

మీ
శాకుంతలి

•  •

రాయచూరు,
**1-4-86**

డియర్ మురళీగారూ!

ఎలా ఉన్నారు. మీ ఉత్తరం చేరింది. ఉగాది శుభాకాంక్షలకు థాంక్స్. మీ నవలకు బహుమతి వచ్చిందని తెలిసి సంతోషించాను. నవల పేరు "స్నేహమయి నీకు జోహారు" అన్నారు కదూ. చాలా బాగుంది.

"వెన్నెల" వార పత్రికలో మీకథ "మల్లెల వాన" చదివాను. వండర్‌ఫుల్!

రేపు మా చిరంజీవి 'వంశీ' బర్త్‌డే. చాలాపని వుంది. ఇక వుంటాను. మరిచాను .. మీ బర్త్‌డే ఎప్పుడు? ప్లీజ్ రాయరూ?

మీ
శాకుంతలి

•  •

గూడూరు
**2-5-86.**

డియర్ మురళీ!

మీ ఉత్తరం రాయచూర్‌నుండి రీ-డైరెక్ట్ అయి ఇక్కడికి వచ్చింది. మాకు ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయింది. మీరు కర్నూలుకు ఆడిట్ కోసం వస్తామనిరాసారు.



# క్షమించవూ!?

వీలయితే వస్తాం.
మీ
శాకుంతలి.

• •

గూడూరు,
**13-11-86**

ఓ నా నేస్తం,

ఈ ఉత్తరాన్ని పోస్టుచేయలేని నా అశక్తతను ఎలా వివరించను? ఈ ఉత్తరాన్ని నా మానసిక క్షోభ తగ్గేందుకే రాసుకొని నా ఎదపైనే నిలుపుకొని పలుమార్లు చదువుకుంటాను. ఇంతేం చేయగలను?

"కలుసుకొందుమో లేదో
కట్టుకుందాం యిక్కు
కాగితం తీరంలోన—"

అంటూ ఎన్నెన్నో ఊసులతో స్నేహం చేశాను. ఎడారిలాంటి నా జీవితంలో ఓ ఒయాసిస్సు నీ స్నేహం. నా చిన్నరాజ్యంలో నాకు తోడు నీడవైన ప్రాణానివి నీవు నిన్ను మరువగలనా నేస్తం. నాకు నీ ఉత్తరాలన్నీ అందాయి. కానీ ఏంచేయను నేస్తం?

మీరు కర్నూలుకు వస్తానని రాసిన ఉత్తరం చదివి, మిమ్మల్ని రమ్మని ఫోన్ చేయటానికి వెళ్ళిన ఆయన-తిరిగి వచ్చేసరికి ఎన్నెన్ని మార్పులు?

లైన్ దొరకలేదట - అది నా ప్రారబ్ధం
ఆ తర్వాత వారి వైఖరిలో మార్పు.

నేను ఓ మామూలు ఇల్లాలిని. భర్తే సర్వస్వం అని, భర్తమాట జవదాటగూడదని తర తరాలనుంచి ఘోషిస్తున్న సంప్రదాయంలో పుట్టినదాన్ని.

"కుంతలీ! నీవు నా ప్రాణం. నీవు అతనికి ఉత్తరం రాయొద్దు," అని భర్తే అంటే మారు మాట్లాడక ఆయన ఆజ్ఞకు బద్ధురాలినైన పతివ్రతా శిరోమణిని.

కానీ నేస్తం...

నా మనసు, ఆలోచనలు అన్నీ నీవే! నా స్నేహానికి ప్రాణమైన మురళీ నా మనసునిండా నీ స్నేహ పరిమళమే!! నన్ను నీవు మరచినా... నా ఈ చిన్న ప్రపంచంలో అంతటా నీవే నేస్తం!!!

ఒంటరితనం వెక్కిరిస్తున్న వేళ చప్పున జ్ఞాపకం వచ్చేది నీవే- నన్ను మరువకు సుమా!

ఉత్తరాలు హఠాత్తుగా ఆపేసినందుకు క్షమించు. క్షమిస్తావు కదూ?

శాశ్వతంగా సెలవుకోరే
నిరంతర నీస్నేహ పిపాసి
శాకుంతలి



## మీరేం చేస్తారు?

*స్రవంతి నెం: **14**లో 'మీరేం చేస్తారు'లో ఇచ్చిన*

**మీ మొట్టమొదటి విమాన ప్రయాణానికి టిక్కెట్ వుచితంగా వస్తే?**

*విషయానికి ఎన్నికైన సమాధానాలు. మొదటి ఇద్దరికి ఒక్కొక్కరికి పదిరూపాయలు పారితోషికం.*

• ముందుగా మా ఎదురింటి హెడ్మాస్టరు గారికి ప్రజంట్ చేస్తాను. "పిల్లలు గలవాడ్ని నాయనా... వద్దూ" అంటే, మా పక్కింటి గోపాలంగారికి (ఇంకోసారి ఆయన కవితలు నేను వినకుండా) ఇస్తాను. తను వద్దంటే ..మా రేడియో మెకానిక్కికూ అతనొద్దంటే రోజూ టీ.వీలో న్యూస్ చదివే న్యూస్ రీడర్‌కి పంపేస్తాను. -శ్రీనివాసరాజా
ఇన్‌స్ట్రక్టర్, శక్తి ఐ.టి.ఐ
మంచిర్యాల-**504208**
అదిలాబాద్(జిల్లా)

•• ఇంతకుముందు విమాన ప్రయాణం చేసిన వారిని కల్సి, విమానంలో మూత్రశాల, మరుగుదొడ్డి లాంటి సౌకర్యాలు ఉన్నవో, లేవో తెలుసుకుంటాను. ఆయా సౌకర్యాలు ఉన్నట్లయితేనే ప్రయాణానికి ఒప్పుకుంటాను.

. తర్వాత నాపేర 5 లక్షల రూపాయలకు జీవితభీమా చేయిస్తాను. ఎందుకంటే ఈమధ్య "టెర్రరిస్టులచేత విమాన హైజాకింగ్", ప్రయాణీకులకాల్చివేత"లాంటి వార్తలు మనం పేపర్లలో చూస్తున్నాం కదా! ఇక ఎయిర్‌హోస్టెస్‌ల నాకర్షించడానికి సినీహీరోలా స్మార్ట్‌గా మేకప్ అయి మరీ వెళతాను. - ఎ. సారెయ్య
ఇంటి నెం. **14-1-118**
మండిబజారు, మట్వాడా
వరంగల్లు-**506 012**

• చింపిపారేస్తాను ఎందుకంటే నేను బ్రతకాలి కాబట్టి. -ఎస్.ఎస్.ఆర్. కుమార్
(ఏలూరు)

• నడుంకి రెడీగా "పారాష్యూట్, బిగించుకొని ప్లేన్ ఎక్కుతాను.
-పి. రమాకాంత్ (పొన్నూరు)

• ఆ... ఏముంది! హైదరాబాద్‌లోముఖం కడుక్కొని విమానం ఎక్కుతాను. ఆ తర్వాత మద్రాసులో స్నానంముగించి. తిరిగి బెంగుళూరు ఏర్‌పోర్టులో వేడి వేడి టిఫిన్ లాగించేసి, మళ్ళీ బొంబేలో గరంకాఫీ త్రాగుతాను. అనంతరం తిన్నగా ఢిల్లీ వెళ్ళి డిన్నర్ ముగించడం తదనంతరం ప్రధానమంత్రి గారికో సెల్యూట్ కొట్టి వెంటనే హైదరాబాదు వచ్చేస్తాను. ఏమంటారూ?
యస్.పి. తిరుమలనేషన్
(మహబూబాబాద్)

• చచ్చినా తీసుకోను. బేవర్సు పాసింజరుని సిటీబస్‌లోలాగా నించోమంటారు. బిస్కట్లు ఇవ్వరు. టీ, స్నాక్స్ ఇవ్వరు. మధ్యలో ఎక్కడైనా ఆగిపోతే పైలట్ దిగి తొయ్యమంటాడు. హైజాకర్లుంటే మొదట నన్నే కాల్చమంటాడు పైలట్. అందుకే చచ్చినా తీసుకోను.
--జె. కృష్ణారావు (గుంటూరు)

• అసలిది నిజమైన టికెట్టా? ఎవరైనా ఫూల్‌ని చేస్తానికి పంపారా? అని తెల్సుకుంటాను. నిజమేనని నమ్మినతర్వాత ఇన్సూరెన్స్ వాళ్ళకి ఫోన్‌చేసి ఓపది లక్షలకు లైఫ్ పాలసీ తీసికుంటా. (ఏమో ఏ విమానంలో ఏ బాంబుందో? ఏ విమానంలో ఏ టెర్రరిస్ట్ ఎక్కుతాడో చెప్పలేం) ఒకవైపు శ్రీదేవి ఇంకోవైపు స్మిత ఉండేలా సీటువస్తే తలనీలాలిస్తానని మొక్కుకుంటా. ఇరుగు పొరుగు వాళ్ళని పురుగుల్లా చూస్తా. మా మేనేజర్‌ని విష్‌చేయడం మానేస్తా!
-జి. శివశంకరరావు(తెనాలి)

## ఫర్ యువర్ ఇన్ఫర్‌మేషన్

**మీకు తెలిస్తే చెప్పుకోండి :**

1. ప్రపంచంలో కెల్లా పెద్ద స్టేడియం ఏది? ఎక్కడుంది?
2. పెద్ద రైల్వే స్టేషన్ ఏది? ఎక్కడుంది?
3. మొట్టమొదట మన దేశంలో రూపాయి నాణెం ఎప్పుడు వాడుకలోకి వచ్చింది?
4. ప్రథమ ఆసియా క్రీడలు ఎప్పుడు ఎక్కడ జరిగాయి?
5. మన జాతీయ పతాకాన్ని మొట్టమొదట ఎప్పుడు ఎక్కడ ఎగురవేశారు?

పంపినవారు :
—జి. విజయలక్ష్మి
(నెల్లూరు)

సమాధానాల కోసం 30 వ పేజీ చూడండి.